


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




శనివారం 07 మార్చి 2026 | పేజీలు 04 | వెల - 2/- | సంపుటి 01 సంచిక 278 | ప్రచురణ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత

## ఆర్ అండ్ బి కార్యాలయాల్లో 99 రోజుల కార్యాచరణలో భాగంగా తనిఖీలు



సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 7: ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ కార్యాలయాల్లో తనిఖీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అదనపు కార్యదర్శులతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని టి.ఆర్ అండ్ బి విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాత రికార్డులను సక్రమంగా సర్దుబాటు చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని, క్లోజ్ చేయాల్సిన ఫైళ్లను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం రెడ్ హిల్స్‌లో ఉన్న రోడ్లు భవనాలు శాఖ భవనంలో సెంట్రల్ బిల్డింగ్ డివిజన్‌తో పాటు అక్కడ పనిచేస్తున్న ఇతర కార్యాలయాలను కూడా సందర్శించారు. అధికారులు, సిబ్బంది కలిసి కార్యాలయ ప్రాంగణం, రికార్డు గదులు మరియు అందులో ఉన్న ఫైళ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టి ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కువకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను ముందుగా గుర్తించి ప్రతిరోజూ లక్ష్యాన్ని నిర్దేశించి పని చేయాలని సూచించారు. ఎస్టాబ్లిష్‌మెంట్, విజిలెన్స్, క్రమశిక్షణ కేసులు, నాణ్యత నియంత్రణ రికవరీలు, కోర్టు కేసులు వంటి పాత ఫైళ్లను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని తెలిపారు. కార్యాలయ నిబంధనల ప్రకారం పాత రికార్డులను తొలగించాలని, ముఖ్యంగా 2014కు ముందు ఉన్న ఫైళ్లను అవసరమైతే స్కాన్ చేసిన డిజిటల్ రికార్డుల నుంచి ప్రతులు తీసుకుని సూచికలతో భద్రపరచాలని అధికారులకు సూచించారు.




## ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం కట్టుబడి ఉంది: సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 7: హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ప్రజలదేనని, ప్రజాపాలన రావాలని ప్రజలు కోరుకున్నందుకే 2023 ఎన్నికల్లో కష్టపడి ఈ ప్రభుత్వాన్ని తీసుకొచ్చారని తెలిపారు. అధికార యంత్రాంగం, అక్రమ సంపాదనలు తమ వద్ద లేకపోయినా ప్రజల విశ్వాసంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, ఈ సమస్యను 20 ఏళ్లుగా తాను ప్రత్యక్షంగా గమనిస్తున్నానని పేర్కొన్నారు. పోరాటాల్లో కొందరు ప్రాణత్యాగాలు చేసిన నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణేనని చెప్పారు. వర్గీకరణతో అన్ని సమస్యలు పరిష్కారం కాకపోయినా ప్రమోషన్లు, ఉన్నత విద్య, భూముల పరిరక్షణ వంటి అంశాలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. బలహీన వర్గాల పక్షాన నిలబడటం తన బాధ్యతగా భావిస్తున్నానని, రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా మాదిగల పక్షాన నిలిచానని అన్నారు. ప్రభుత్వానికి కళ్లూ చెవులూ ప్రభుత్వ ఉద్యోగులేనని, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే ఉద్యోగులు కష్టపడి పనిచేయాలని కోరారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి నెల వెయ్యి మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నప్పటికీ ఆర్థిక సమన్వయంతో ప్రభుత్వం నడిపిస్తున్నామని తెలిపారు. పేదల అభివృద్ధికి విద్యే మార్గమని, ప్రభుత్వ విద్యా వ్యవస్థను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో బర్రెలు, గొర్రెలు ఇచ్చిన విధానాల కంటే విద్య, ఉద్యోగాల ద్వారా సమాజం ముందుకు రావాలని సూచించారు. కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు గా ఎదిగి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తనకు వచ్చిన ముఖ్యమంత్రి పదవిని ప్రజలకు సేవ చేయడానికి ఉపయోగించుకుంటానని, అందరి వాడిగా పని చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 7: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. యూపీఎస్సీ ఫైనల్స్‌లో తెలంగాణ నుంచి అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమయ్యే పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన 202 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించామని తెలిపారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం పొందిన అభ్యర్థుల్లో 51 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని, ఇంటర్వ్యూకు హాజరైన వారిలో 20 మంది సివిల్ సర్వీసెస్ తుది ఫలితాల్లో మంచి ర్యాంకులతో విజేతలుగా నిలిచారని వెల్లడించారు. రాష్ట్రం నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## మాదిగ జాతికి చారిత్రాత్మక న్యాయం చేసిన ప్రజా ప్రభుత్వం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్।




సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 7: మాదిగ సమాజానికి దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న న్యాయం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధ్యమైందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. తెలంగాణ మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వర్గీకరణ చట్టం అమలుతో మాదిగ సమాజానికి విద్యా, ఉద్యోగ అవకాశాల్లో గణనీయమైన పురోగతి సాధ్యమైందన్నారు. మాదిగ జాతికి న్యాయం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యేలంతా కలిసి వర్గీకరణ చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి రాష్ట్రంలోని 33 జిల్లాల ఉద్యోగులు ముఖ్యమంత్రికి అభినందనలు తెలపాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం సాధనలో ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా తమకు పెద్దన్నలా మార్గనిర్దేశనం చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వీరేశం, శామ్యూల్, కంబంపల్లి సత్యం, లక్ష్మీకాంతం కలిసి మాదిగ సమాజ అభ్యున్నతికి పనిచేస్తున్నామని తెలిపారు. వర్గీకరణ అమలుతో ఇప్పటికే 772 మందికి డాక్టర్లు, ఇంజినీర్లుగా అవకాశాలు లభించాయని, గ్రూప్–2లో సుమారు 16 వేల మందికి, గ్రూప్–3లో దాదాపు 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కాయని వెల్లడించారు. త్వరలో హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ టవర్ నిర్మాణం చేపట్టడంతో పాటు కాచిగూడలో బాబు జగ్జీవన్ రాం పేరుతో జగ్జీవన్ భవన్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. అంబేద్కర్ స్ఫూర్తితో సామాజిక న్యాయం, సంక్షేమం దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మద్దతుగా నిలవాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.


## హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 7: హైదరాబాద్‌లో ఎకో హిల్ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ కంటే సుందరమైన నగరం దేశంలో లేదని, మంచి ప్రభుత్వం ఉంటే దీన్ని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కృష్ణా, గోదావరి నదుల నీటిని నగరానికి తీసుకువచ్చారని గుర్తుచేశారు. నిజాం నవాబు కాలంలో ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యతో కలిసి వరదల నివారణ కోసం మూసి నదిపై నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రి, గోల్కొండ కోట, అసెంబ్లీ భవనం వంటి చారిత్రాత్మక కట్టడాలు హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపని చెప్పారు. ప్రస్తుతం నగరం ఆక్రమణలు, చెత్తతో నిండిపోయిందని, దాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కొత్త ప్రాజెక్టులు తీసుకురాగానే కొందరు వ్యతిరేకిస్తున్నారని, కానీ అభివృద్ధి కోసం అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శంషాబాద్ ప్రాంతాన్ని బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అభివృద్ధి చేసి బెంగళూరు, అమరావతి, చెన్నై నగరాలకు బుల్లెట్ ట్రైన్ సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. మూసి నది తీరాన్ని అభివృద్ధి చేసి మూసి రివర్ ఫ్రంట్ ఏర్పాటుతో పాటు నైట్ ఎకానమీని అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అభివృద్ధి పనుల వల్ల భూములు కోల్పోయే వారిని అనాథలుగా వదిలిపెట్టమని, నిర్వాసితులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేసి సన్న బియ్యం అందిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. మహిళలకు అందించే ఇందిరమ్మ చీరలను కొత్త రంగుల్లో అందిస్తామని తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేసి హైదరాబాద్‌ను ప్రపంచంతో పోటీపడే నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా సమాచార శాఖ కార్యాలయంలో తనిఖీలు





సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 7: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మాసాబ్ ట్యాంక్‌లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. అనంతరం కార్యాలయంలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి పరిసరాలను తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి సెక్షన్‌లో ఉన్న ఫైళ్లను సక్రమంగా నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నిర్దేశిత కాలం అనంతరం పాత వార్షిక ఫైళ్లను స్టోర్‌రూమ్‌లో క్రమపద్ధతిలో భద్రపరచాలని తెలిపారు. బీరువాలు, డెస్కులలో రన్నింగ్ ఫైళ్లను మాత్రమే ఉంచాలని స్పష్టం చేశారు. కార్యాలయ గదులు, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్ జగన్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ వి. రాధాకిషన్, ఆర్ఐలు జె. రాములు, పి. జయరాం మూర్తి, ఉప సంచాలకులు ఎం. మధుసూదన్, వై. వెంకటేశ్వర్లు, ఎస్.ఏ హష్మి, రాజరెడ్డి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికను ఛాలెంజ్‌గా తీసుకోవాలి: మంత్రి దామోదర రాజనర్సింహ



సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 7: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం ఒక ఛాలెంజ్‌గా తీసుకుని విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన 10 థీమ్స్ చాలా సమగ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. వేసవి ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మార్చి 12న జరగనున్న ప్రజాప్రతినిధుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఆసుపత్రుల అభివృద్ధి కమిటీల సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, కమ్యూనికేషన్ లోపాలు లేకుండా అధికారులు పనిచేయాలని, ఇది ప్రజలకు దగ్గరగా ఉండే స్నేహపూర్వక ప్రభుత్వం అని అన్నారు. మూడో విడతగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాలని సూచించారు. గ్రామసభల్లో వచ్చే దరఖాస్తుల స్వభావాన్ని ముందుగానే అంచనా వేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటవీ భూముల సమస్య పాలమూరు జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నందున రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలను గ్రామసభల్లో వెల్లడించాలని, లబ్ధిదారుల జాబితా, నోడల్ అధికారుల వివరాలు, దరఖాస్తుల సమాచారాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలకు అందించాలని తెలిపారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులపై పూర్తి సమాచారం సేకరించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రాష్ట్రంలో 46 లక్షల మంది మహిళలకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తున్నామని, 99 రోజుల కార్యాచరణలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో 70 శాతం మహిళలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఆరోగ్య శాఖ తన బాధ్యతలో ఉందని, దీనిపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఐదు జిల్లాల్లో ప్రజాపాలన కార్యక్రమానికి తాను స్వయంగా హాజరవుతానని చెప్పారు. అలాగే ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టి 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

# సూర్యాపేట జిల్లాలో ఉచితంగా హెచ్‌పివి టీకా పంపిణీ: మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ కవచం

సందేశం టైమ్స్, శెట్టి వెంకటేష్: సూర్యాపేట జిల్లాలో మహిళలకు సోకే గర్భాశయ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణ కోసం 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాలు పూర్తి కాని ఆడపిల్లలకు ఉచితంగా హెచ్‌పివి (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీ నుండి ప్రారంభించనున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ పంపిణీ సూర్యాపేట జిల్లా ఆసుపత్రి, కోదాడ ఏరియా ఆసుపత్రి, హుజూర్ నగర్, తుంగతుర్తి మరియు నడిగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించబడుతుందని, 01-04-2011 నుండి 31-03-2012 మధ్య జన్మించిన బాలికలు ఈ టీకా వేయించుకోవడానికి అర్హులని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కె. కోటి రత్నం వివరించారు. జిల్లా జనాభాలో సుమారు 1% అనగా 11,964 మంది బాలికలకు ఈ వ్యాక్సిన్ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అర్హత కలిగిన బాలికలు జనన ధృవీకరణ కోసం ఏదైనా గుర్తింపు కార్డుతో పాటు తల్లిదండ్రుల సమక్షంలో టీకా కేంద్రాలకు వచ్చి వ్యాక్సిన్ తీసుకోవాలని వారు కోరారు. వచ్చే నెల నుండి అన్ని గ్రామీణ మరియు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా కూడా ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందని, ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించి ఈ కార్యక్రమాన్ని 100% విజయవంతం చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో కట్టెకోల చిన నరసయ్యకు ఘన సత్కారం



సందేశం టైమ్స్, ఖమ్మం ప్రతినిధి, మార్చి 7: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యకు ఘన సత్కారం లభించింది. కొత్తగూడెం రేడియో స్టేషన్ డైరెక్టర్ కొలిపాక శంకర్రావు ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన కవులు, కవయిత్రులతో శుక్రవారం పరాభవ నామ ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కట్టా రామకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కవి సమ్మేళనంలో కట్టెకోల చిన నరసయ్య "అమానవీయ యుద్ధాలు" అనే శీర్షికతో రచించిన కవితను ఆలపించారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా సమాజానికి అద్దం పట్టే విధంగా ఈ కవిత ఉందని ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ శంకర్రావుతో పాటు పలువురు కవులు నరసయ్యను అభినందించారు. అనంతరం కట్టెకోల చిన నరసయ్యను పూలమాలలు, పండ్లతో తువ్వాలు కప్పి ఘనంగా సత్కరించారు.



# మేడికుందలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు ప్రారంభం

సందేశం టైమ్స్, వట్పల్లి ప్రతినిధి, మార్చి 7: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మేడికుంద గ్రామంలో సర్పంచ్ చంద్రకళ ఆధ్వర్యంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రారంభ దినమైన మార్చి 6న గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి వెంట పనికిరాని మొక్కలను తొలగించడం, ఎగుడు దిగుడు గా ఉన్న మట్టిని సమతలీకరించడం, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. గ్రామాన్ని శుభ్రంగా ఉంచి అభివృద్ధి దిశగా తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రకళ, ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు, గ్రామ కార్యదర్శి చరణ్, రాజ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో నారాయణఖేడ్ జడ్‌పి హెచ్‌ఎస్ పాఠశాల అభివృద్ధి






సందేశం టైమ్స్, నారాయణఖేడ్ ప్రతినిధి, మార్చి 7: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడేందుకు పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో కీలకమని జడ్‌పి హెచ్‌ఎస్ నారాయణఖేడ్ ప్రధానోపాధ్యాయులు మన్మథ కిషోర్ తెలిపారు. సమాజంలోని దాతలు, పూర్వ విద్యార్థులు, సేవాభావం కలిగిన వ్యక్తులు ప్రభుత్వ పాఠశాలలకు సహకారం అందించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం చంద్రశేఖర్ ఆచార్య మిత్రులు మరియు ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సహకారంతో సుమారు రూ.10 వేల విలువ గల ఇన్సులేటర్ పరికరాన్ని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో దాతల సహకారంతో పాఠశాలలో చదువుతున్న సుమారు 900 మంది విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, విద్యా సామాగ్రి, ఆంగ్ల నిఘంటువులు, క్రీడా సామగ్రి, క్రీడా దుస్తులు వంటి అనేక సదుపాయాలు అందించామని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పీఎం శ్రీ పథకం ద్వారా విద్యార్థులకు వివిధ ప్రాంతాలకు విజ్ఞాన విహారయాత్రలు నిర్వహిస్తూ ప్రాయోగిక జ్ఞానం అందించే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమలు, సంస్థలను సందర్శించే ఇండస్ట్రియల్ విజిట్లను కూడా నిర్వహిస్తూ విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నామని వివరించారు. ఈ క్రమంలో విద్యార్థులు హైదరాబాద్ నగరంలోని అనూస్ బ్యూటిషియన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, చంద్రశేఖర్, దన్సింగ్, చరణ్ సింగ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

# బోరంచలో శ్రీ నల్లపోచమ్మ దేవస్థానంలో విశేష పూజలు – మహా మంగళహారతి ఘనంగా నిర్వహణ



మనూర్ మండలం, మార్చి 7 (సందేశం టైమ్స్ నారాయణఖేడ్ నియోజకవర్గ ఇన్చార్జి టీ చంద్రశేఖర్): సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం బోరంచ గ్రామంలో మంజీరా నది ఒడ్డున వెలసిన శ్రీ నల్లపోచమ్మ దేవస్థానంలో శుక్రవారం విశేష ప్రార్థనలు, ప్రత్యేక పూజలు మరియు మహా మంగళహారతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అద్భుతంగా అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా "ఓం శ్రీ మాత్రే నమః" మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం భక్తి పరవశంతో మార్మోగింది. అనంతరం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆశీర్వాదాలు పొందారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయగా కార్యక్రమం ఎంతో భక్తి వైభవంతో కొనసాగింది.

# ఖాదిరాబాద్ సీఎస్ఐ సంగంలో ఉపవాస ఆరాధన ఘనంగా



వట్పల్లి, మార్చి 7 (సందేశం టైమ్స్ అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు): సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలోని వట్పల్లి మండలం ఖాదిరాబాద్ గ్రామంలో ఉన్న సీఎస్ఐ సంగంలో శుక్రవారం ఉపవాస ఆరాధన భక్తి భావంతో నిర్వహించారు. ఈ ఆరాధనలో స్థానిక సంఘ సభ్యులతో పాటు పరిసర ప్రాంతాల నుండి వచ్చిన ఇతర సంఘాల విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక గురువు రెవ. జి. దేవదాస్ అయ్యగారు దేవుని మహిమను వివరంగా ప్రకటిస్తూ మానవాళి రక్షణ కోసం యేసుక్రీస్తు సిలువపై త్యాగం చేసిన గొప్ప ప్రేమను తన సందేశంలో తెలియజేశారు. అనంతరం విశ్వాసులు అందరూ కలిసి ప్రార్థనలు చేసి దేవుని ఆరాధిస్తూ ఉపవాస ఆరాధనను భక్తిశ్రద్ధలతో కొనసాగించగా కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలిగించింది.





# 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా నిషేధం

సందేశం టైమ్స్, కర్ణాటక, మార్చి 8: కర్ణాటక ప్రభుత్వం 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పిల్లల్లో మొబైల్ ఫోన్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో దాని వల్ల కలుగుతున్న ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. పిల్లల మానసిక ఆరోగ్యం, చదువుపై దృష్టి కేంద్రీకరించేందుకు మరియు సోషల్ మీడియా ప్రభావాన్ని నియంత్రించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయంతో బాలల భవిష్యత్తు, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని మరిన్ని చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం సూచించింది.

# అల్లాదుర్గ్‌లో ఎస్ఎస్ఎఫ్ సైన్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

అల్లాదుర్గ్, మార్చి 7 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): మెదక్ జిల్లా అల్లాదుర్గ్ మండలంలో మైనార్టీ యువ నాయకుడి ఆధ్వర్యంలో సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) సైన్స్ క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు బాన్సువాడ వేదాంత్ మౌర్య హాజరై మాట్లాడుతూ 22 ఏళ్ల చరిత్ర కలిగిన ఎస్ఎస్ఎఫ్ సంస్థ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. మూఢనమ్మకాల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు చిన్న వయస్సులోనే శాస్త్రీయ అవగాహన కల్పించడం అవసరమని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వం మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని తీసుకురావాలని కోరారు. నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క సూర్యకుమార్ మాట్లాడుతూ సైన్స్ లేకుండా ప్రపంచ మనుగడ అసాధ్యమని, ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని సూచించారు. బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు లతీఫ్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి సైన్స్ గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని ఆచరణలో పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ నాయకుడు మోహన్ రాథోడ్, అల్లాదుర్గ్ గ్రామ ఉప సర్పంచ్ కళాయి పాండు, బేతయ్య, ఈర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు. "విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి మూఢనమ్మకాల నిర్మూలనకు ఎస్ఎస్ఎఫ్ నిరంతరం కృషి చేస్తుంది" అని బాన్సువాడ వేదాంత్ మౌర్య తెలిపారు.

# సంగారెడ్డి తార ప్రభుత్వ కళాశాలలో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమానికి శ్రీకారం






సంగారెడ్డి మర్చి 7( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్)సంగారెడ్డి తార గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ప్రవీణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ, విద్యాశాఖ అభివృద్ధి కోసం పది రోజుల ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీ క్యాడెట్లు, విద్యార్థులు కలిసి కళాశాల పరిసరాలను శుభ్రపరిచి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. పర్యావరణ పరిశుభ్రతను కాపాడేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. వచ్చే పది రోజుల్లో కళాశాలలో రికార్డుల సక్రమ నిర్వహణ, సైన్స్ ల్యాబ్ సదుపాయాల మెరుగుదల, వివిధ విభాగాల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, ఎన్ఎస్ఎస్ అధికారులు, ఎన్సీసీ అధికారి, విద్యార్థులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి తార ప్రభుత్వ కళాశాలలో రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతంగా ముగింపు

సంగారెడ్డి, మార్చి 7 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్): సంగారెడ్డి తార గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ లో కంప్యూటర్ సైన్స్ మరియు జీవశాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. "ది ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ సైన్స్ – ఇంటిగ్రేటింగ్ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ అండ్ బయోలాజికల్ రీసెర్చ్" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి వచ్చిన అధ్యాపకులు, పరిశోధకులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ పత్రాలను త్వరలో ఐఎస్‌బిఎన్ నంబర్‌తో ప్రత్యేక మేగజైన్‌గా విడుదల చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. సదస్సులో ప్రొఫెసర్ బాల భాస్కర్, ప్రొఫెసర్ రాజేందర్ సింగ్ ఉపన్యాసాలు అందించారు. కంప్యూటేషనల్ బయాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, బయో రీమిడియేషన్ వంటి అంశాలపై ప్రత్యేక చర్చలు నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కన్వీనర్ డాక్టర్ నాగప్రసాద్, కో-కన్వీనర్ డాక్టర్ వై. రమేష్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ మిథున్ కుమార్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, కళాశాల అధ్యాపకులు, ఎమ్మెస్సీ జువాలజీ మరియు కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు, ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

# మెదక్‌లో 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికపై సన్నాహక సమావేశం

## మెదక్‌లో 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమానికి జిల్లా నేతల సన్నాహక సమావేశం





మెదక్, మార్చి 7 (సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి బి. సంగమేశ్వర్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మెదక్ జిల్లా ఇంచార్జీ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికను రూపొందించిందన్నారు. పట్టణాలు, గ్రామాలు సమానంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రభుత్వం పట్ల నమ్మకం పెరిగేలా చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని, వాటిని ప్రజలకు తెలియజేస్తూ 99 రోజుల ప్రగతి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, బ్లాక్ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్ డివిజన్‌లో భూమి మోసాలు: పోలీసులు కంగ్టి, సిర్గాపూర్ పరిధిలో హెచ్చరిక

నారాయణ ఖేడ్ మర్చి 7( సందేశం టైం సంగారెడ్డి జిల్లా ప్రతినిధి) నారాయణఖేడ్ డివిజన్‌లోని కంగ్టి, సిర్గాపూర్ ప్రాంతాల్లో భూములు కొనే వారిని దళారుల మోసాల నుండి జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.పోలీస్ ప్రకారం, కొంత మంది దళారులు రైతుల పాసుబుక్ పై ఉన్న ఫోటోలను మార్చి, అగ్రిమెంట్ చేసుకుని మోసం చేస్తున్నారు. దాంతో, అసలు భూమికి బదులు రోడ్ పక్కన ఉన్న భూమిని చూపించి రిజిస్ట్రేషన్ చేసేవారు ఉన్నారు.మరొక విధంగా, కొంత మంది తక్కువ రేటులో భూమి వస్తుందంటూ ముందుగా 25% చెల్లింపుతో అగ్రిమెంట్ చేసుకుని, రిజిస్ట్రేషన్ సమయానికి కనిపించకుండా పోయి మోసం చేస్తారని అధికారులు వెల్లడించారు.పోలీస్ వినతి: భూమి కొనేవారుది ముందుగా గ్రామ, మండల, డివిజన్ ప్రజా ప్రతినిధులు లేదా అధికారుల ద్వారా స్థిరమైన సమాచారం సేకరించాలి, రెవెన్యూ రికార్డ్స్ పరిశీలించి ప్రస్తుత మార్కెట్ రేటును తెలుసుకొని మాత్రమే కొనుగోలు చేయాలని.CIP కంగ్టి ద్వారా అధికారిక హెచ్చరిక జారీ అయ్యింది.

# సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య హత్నూరలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించి అధికారులకు ఆదేశాలు

## హత్నూర మంగపూర్ గ్రామంలో ఇండ్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించిన కలెక్టర్ – నాణ్యత ప్రమాణాల ప్రకారం వేగవంతమైన పూర్తి పనికి అధికారులు దృష్టి





సంగారెడ్డి, మార్చి 07( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్ )సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శుక్రవారం హత్నూర మండలం, మంగపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కలెక్టర్ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని ప్రతి గ్రామంలో పూరి ఇళ్లలో నివసిస్తున్న పేద కుటుంబాలను గుర్తించి, వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని, ప్రజాపాలన-ప్రగతి 99 రోజుల కార్యాచరణలో భాగంగా లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో మంజూరైన ఇండ్ల సంఖ్య, నిర్మాణ దశలు, లబ్ధిదారుల ఖాతాల్లో నిధుల జమ, ఫోటోకాప్చరింగ్ తదితర అంశాలపై పై ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ స్లాబ్ పనులు పూర్తయిన ఇళ్లను ఏప్రిల్ 20-26 న నిర్వహించబోయే సంక్షేమ మహోత్సవాల సందర్భంగా గృహప్రవేశ కార్యక్రమాలకు సిద్ధం చేయాలని, వేసవి కాలం సమీపించడంతో గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా బోర్లు మరమ్మత్తులు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా వంటి చర్యలు చేపట్టాలని మండల అధికారులను ఆదేశించారు. అనంతరం కసాల గ్రామంలోని డీసీఎంఎస్ ఎఫ్ఎస్‌సీ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేసి, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సరిపడా నిల్వలో ఉండేలా, ధరలు స్పష్టంగా ప్రదర్శించేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి చలపతి రావు, సర్పంచ్ మన్నే రాధా రమేష్, తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయితీ సెక్రటరీ, ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# పాపన్నపేటలో 'సెల్ఫ్ గవర్నమెంట్ డే' ఘనంగా నిర్వహణ – విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి ప్రోత్సాహం పొందారు

మెదక్, మార్చి 7 (సందేశం టైమ్స్ అల్లాదుర్గ్ మండలం రూరల్ రిపోర్టర్ జి కుమార్): మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఎంపీపీస్ నర్సింగరావుపల్లి తండాలో శుక్రవారం ఘనంగా "సెల్ఫ్ గవర్నమెంట్ డే" నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ పాఠశాల యూనిట్లను నడిపారు.ఈ రోజు ప్రత్యేకంగా డి ఇ ఓగా అగ్నివేశ్, ఎం ఇ ఓగా శ్రీమాన్, హెడ్మాస్టర్‌గా సుమిత్ర వ్యవహరించగా, ఉపాధ్యాయులుగా ప్రదీప్, అశ్విని, అక్షిత, సుజాత, సాయిప్రియ, కిరణ్, రాజు, వంశీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శ్రీనివాస్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి, ఉపాధ్యాయులు అజయ్ కుమార్, మౌనిక, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ తదితరులు విద్యార్థులను ప్రోత్సహించి వారిని స్ఫూర్తిపరిచారు.



# జహీరాబాద్ మహిళా కాంగ్రెస్ నేతలు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరిపై రాజీనామా డిమాండ్



సంగారెడ్డి, మార్చి 7 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): జహీరాబాద్ నియోజకవర్గంలోని హోతి బీ గ్రామంలో మహిళా కాంగ్రెస్ గ్రామ అధ్యక్షురాలు స్వప్న ఆధ్వర్యంలో శుక్రవారం "దీ. పీ.యం. ఇస్ కాంప్రమైజ్డ్" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నేత అస్మా, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి పేరు ఎప్స్టీన్ ఫైల్‌లో కనుగొనబడటంతో పాటు, ఎప్స్టీన్ వంటి సీరియల్ రేపిస్ట్, పెడోఫైల్‌తో మంత్రిగా ఉన్నప్పటికీ సంబంధం ఉందని ఆరోపించారు.అస్మా మహిళా సర్వజనాభి గౌరవం, భద్రత పరిరక్షణకు ఈ ఘటనలో కేంద్ర మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అంతకుముందు ప్రధాని నరేంద్ర మోడీ మౌనంగా ఉన్నందుకు ప్రజల్లో ప్రశ్నలు పెరిగాయన్నారు.ఆమె ఎప్స్టీన్ ఫైల్ దర్యాప్తు వెంటనే.ప్రారంభించాల్సినదని, వందలాది తల్లులు, సోదరీమణులు, కుమార్తెలు కోపంతో సంతకాలు చేసి సమాధానాలు కోరుతున్నారని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పీటీసీ మాణిక్యమ్మ, అనిత, బుజ్జమ్మ, సుజాత, చంద్రకళ,ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు – మంత్రి దామోదర్ రాజనర్సింహ ధన్యవాదాలు తెలిపారు




సంగారెడ్డి, మార్చి 6 (సందేశం టైమ్స్ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి కె. సంగమేశ్వర్): మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేస్తున్న సందర్భంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.సమావేశంలో రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, లక్ష్మణ్ కుమార్, ఎంపీ కడియం కావ్య, శాసనసభ్యులు మాజీ మంత్రి కడియం శ్రీహరి, వేముల వీరేశం, తోట లక్ష్మీనారాయణ, కాలే యాదయ్య, కాంతారావు, ప్రొఫెసర్ కాసిం, మేడి రమేష్, ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, తాహసిల్దార్ రాధా లు పాల్గొన్నారు.మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు రాష్ట్ర శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును దేశంలో అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, ఈ వర్గీకరణ పోరాటం సుదీర్ఘంగా సాగిందని, రాజకీయ ఒత్తిడి ఉన్న పరిస్థితుల్లో వర్గీకరణను విజయవంతంగా అమలు చేసిన ఘనతకు సీఎం రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# రుద్రారం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి

పటాన్చెరు, మార్చి 7 (సందేశం టైమ్స్ పటాన్చెరు మండల్ రిపోర్టర్ బి డేవిడ్): పటాన్చెరు మండలం రుద్రారం ప్రాథమిక పాఠశాలలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టికలు, పాఠశాల రికార్డులను పరిశీలించడమే కాకుండా, జిల్లా విద్యాధికారి తరగతి గదుల్లో విద్యార్థులతో పాఠాలు చదివించి వారి విద్య సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు లక్ష్యంతో, కృషితో చదువుకోవాలని సూచిస్తూ, పాఠశాల పరిపాలనలో మరింత సమర్థత అవసరమని అభిప్రాయపడ్డారు.తనిఖీ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముత్యం రామచందర్ నేతృత్వంలోని బృందం కూడా పాల్గొన్నారు.

# నగేష్-నాగమణి వార్షిక వివాహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ



రాయికోడ్, మార్చి 7 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం, ఇందూర్ గ్రామానికి చెందిన నగేష్-నాగమణి జంట ఈరోజు వార్షిక వివాహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు సమీప వాసులు పాల్గొని జంటకు ఆశీర్వాదాలు ప్రకటించగా, వేడుకల్లో ప్రత్యేకంగా కేక్ కట్టడం, సంగీతం, నృత్యాలు, స్మారక ఫోటోలు తీయడం వంటి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. నగేష్-నాగమణి ఈ వేడుకను తమ జీవిత భాగస్వామితో గడిపిన క్షణాలను గుర్తు చేసుకునే, ఆనందం, ప్రేమ మరియు అనుబంధాన్ని పంచుకునే సమయంగా పేర్కొన్నారు.



# ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం తీవ్రతలోకి: పశ్చిమ ఆసియా ఉద్రిక్తత పెరుగుతోంది

సందేశం టైమ్స్, జాతీయ ప్రతినిధి:ఇరాన్, అమెరికా మరియు ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఈరోజు తీవ్రమైన దశకు చేరింది. కొన్ని రోజులుగా కొనసాగుతున్న వైమానిక దాడులు, మిస్సైల్ భీభత్సం మరియు ప్రాంతీయ సంఘర్షణలు పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతను కురిపిస్తున్నాయి.

ప్రస్తుత పరిస్థితులు:యుద్ధం ఆరు రోజులుగా కొనసాగుతున్నది. అమెరికా-ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ ప్రధాన నగరాలపై వైమానిక దాడులు కొనసాగిస్తున్నాయి. ఇరాన్ మిస్సైళ్లతో ప్రత్యుత్తరం ఇస్తూ, గల్ఫ్ ప్రాంతాలలో కూడా అప్రమత్తతలు నెలకొల్పింది. ఈ యుద్ధం స్థానిక ప్రజల భద్రత, ఆర్థిక వ్యవస్థలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తోంది.

యుద్ధ దశలు:1️⃣ ప్రారంభ దశ: సంయుక్త దాడులు, ఇరాన్ పై వైమానిక దాడులు.2️⃣ ఇరాన్ ప్రతిస్పందన: మిస్సైళ్ల ద్వారా ప్రత్యుత్తరం, డ్రోన్ దాడులు.3️⃣ ప్రాంతీయ విస్తరణ: లెబనాన్ వంటి ప్రాంతాల్లో సంఘర్షణలు, విస్తృత ప్రభావం.4️⃣ ఆర్థిక-అంతర్జాతీయ ప్రభావ: హార్ముజ్ స్ట్రైక్ట్స్, విమానాశ్రయాల పనిచేయకపోవడం, అంతర్జాతీయ మార్కెట్లకు ప్రతికూల ప్రభావం.భవిష్యత్ దిశ:ప్రస్తుతం యుద్ధానికి అధికారిక ముగింపు తేదీ లేదు. అమెరికా-ఇజ్రాయెల్ దళాలు అదనపు చర్యలకు సిద్ధంగా ఉన్నాయి. ఇరాన్ కూడా కొత్త దాడులను కొనసాగిస్తోంది. విశ్లేషకుల అంచనాల ప్రకారం, ఈ యుద్ధం కొన్ని వారాల పాటు లేదా తగిన దశలోనే మంట పడవచ్చు.

ప్రభావాలు:ప్రాంతీయ భద్రత మరియు ఆర్థిక వ్యవస్థలు ప్రభావితమవుతున్నాయి. గల్ఫ్ దేశాల్లో అప్రమత్తతలు పెరిగాయి, ప్రజాస్థాయిలో నష్టం, మరణాలు నమోదయ్యాయి. యుద్ధం కొనసాగుతూనే, అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది.ఈ ఘటన పశ్చిమ ఆసియా రాష్ట్రాల భవిష్యత్తు, శాంతి ప్రణాళికలపై కీలక పరిణామాలు సృష్టించవచ్చు.



# మహబూబ్ నగర్‌లో 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రారంభం

ఉమ్మడి మహబూబ్ నగర్, మార్చి 7 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 3వ విడత ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రారంభమైంది.మంత్రిగారు 99 రోజుల కార్యాచరణను విజయవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, కలెక్టర్‌లు మరియు ఇతర అధికారులు పాల్గొని ప్రణాళిక విజయాన్ని సమీక్షించారు.

# ఎన్నికల తర్వాత రాజకీయాలను పక్కన పెట్టి అభివృద్ధికి కలసి పని చేయాలి: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**గ్రామాభివృద్ధికి పంచాయతీ భవనం కీలక మైలురాయి - ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచనలు**





సంగారెడ్డి, మార్చి 07 (సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి బి. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా కంది మండలం చిమ్నాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఘనంగా ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రధాన అతిథిగా హాజరై గ్రామాభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ వ్యవస్థ కీలక పాత్ర వహిస్తుందని, ఎన్నికలు ముగిసిన తర్వాత రాజకీయ విభేదాలను పక్కన పెట్టి ప్రతి ఒక్కరు కలసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. నూతన పంచాయతీ భవనం ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని, స్కూల్ భవన నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.కార్యక్రమం తర్వాత గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.





పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని / సంపాదకురాలు: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.